అసమ్మతి.. కుదిరేనా దోస్తీ?

- కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు అలకనేతల సెగలు
- ప్రచారానికి దూరంగా సొంత పార్టీ నాయకులు
- ఆందోళనలో అభ్యర్థులు
- కొనసాగుతున్న బుజ్జగింపులు



ఆదం సంతోష్ కుమార్ కాంగ్రెస్ అభ్యర్థి







సికింద్రాబాద్ నియోజకవర్గంలో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులను అసమ్మతి నీలినీడలా వెంటాడుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ నుంచి పలువురు నాయకులు అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి టికెట్ ఆశించారు. రెండు పార్టీల్లో టికెట్ దక్కని పలువురు నాయకులు నేటికీ తటస్థవైఖరిని అవలంభిస్తున్నారు. ఇక్కడి నుంచి బీఆర్ఎస్ టికెట్ పొందిన టీ.పద్మారావుగౌడ్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. పార్టీలోని వివిధ శ్రేణుల నాయకులు కలివిడిగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఇక్కడి నుంచి బీఆర్ఎస్ టికెట్ ఆశించిన నాయకులు కూడా లేరనే చెప్పాలి. –సికింద్రాబాద్

బుజ్జగింపుల పర్వం..

టికెట్ దక్కించుకున్న అభ్యర్థులు ఆశించి భంగపడిన నాయకులను ప్రసన్నం చేసుకుని మద్దతు కూడగట్టేందుకు వ్యూహారచన చేస్తున్నారు. తీవ్ర నిరాశకు గురైన కొందరు నాయకులు టికెట్ పొందిన నాయకులకు దూరంగా ఉంటున్నారు. కనీసం అభ్యర్థుల ఫోన్‌కాల్స్ రిసీవ్ చేసుకునేందుకు కూడా ఇష్టపడడం లేదు. బీజేపీ టికెట్ ఆశించిన రాచమల్ల కృష్ణమూర్తి టికెట్ దక్కించుకున్న మేకల సారంగపాణికి మద్దతుగా నిలుస్తున్నారు. మిగతా ముగ్గురు నాయకులు బండా కార్తీకారెడ్డి, బండపల్లి సతీష్, రవిప్రసాద్‌గౌడ్ మాత్రం బీజేపీ అభ్యర్థికి మేకల సారంగపాణి ప్రచారాలను సహాయ నిరాకరణ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలోనూ అదే పరిస్థితి కనిపిస్తుంది. కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ ప్రచారాలకు టికెట్ కోసం విఫలయత్నం చేసిన నోముల ప్రకాశ్‌రావు, నాగులూరి సాయిబాబా దూరంగా ఉంటున్నారు.

ఆశించి భంగపడి..

కాంగ్రెస్ పార్టీ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ఆరుగురు నాయకులు టికెట్ రేసులో నిలిచారు. కాంగ్రెస్ టికెట్‌ను ఆదం సంతోష్‌కుమార్, నోముల ప్రకాశ్‌రావు, నాగులూరి సాయిబాబా ఆశించారు. సంతోష్‌కుమార్ టికెట్ దక్కించుకోగా మిగతా ఇరువురు నాయకులు నిరాశకు గురయ్యారు. బీజేపీలో మేకల సారంగపాణితో పాటు మాజీ మేయర్ బండా కార్తీకారెడ్డి, బండపల్లి సతీష్, రవిప్రసాద్‌గౌడ్, రాచమల్ల కృష్ణమూర్తి తదితరులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో మేకల సారంగపాణిని టికెట్ వరించింది. దరిమిలా మిగతా నాయకులు అసంతృప్తికి గురయ్యారు.

అంతుచిక్కని అంతరంగం..

టికెట్ దక్కని నాయకుల అంతరంగం ఏంటో అభ్యర్థులకు అంతుబట్టడం లేదు. నిత్యం తమ దినసరి ప్రచారాలు చేసుకుంటున్న అభ్యర్థులకు సమయం దొరికినపుడల్లా నిరాశకు గురైన నాయకులను కలవడం, బుజ్జగించుకోవడం పనిగా మారింది. కాంగ్రెస్‌లో ఒకరు, బీజేపీలో ఇరువురు నాయకులు తాము తమ అనుచరులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాం అంటున్నారు. ఒకరిద్దరు నాయకులు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించుకుంటున్నట్లు సమాచారం. నామినేషన్ల ఉపసంహరణ తేదీ వస్తేకానీ టికెట్ దక్కని నాయకుల అంతరంగం ఏంటో తెలిసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా గెలుపు ధీమాతో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు మాత్రం అసంతృప్తిలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ నాయకులను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.



మేకల సారంగ పాణి బీజేపీ అభ్యర్థి





ఓటు వేయడం నైతిక బాధ్యతగా భావించాలి



ఓటు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్

అమీర్‌పేట: పౌరులందరూ తమ ఓటుహక్కును కచ్చితంగా వినియోగించుకోవాలని రాయల సేవా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్, వాకర్స్ అసోసియేషన్ చైర్మన్ షాబాద్ శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం సనత్‌నగర్ కేఎల్ఎస్‌వై పార్కులో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఓటేయడం నైతిక బాధ్యతగా భావించి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటేయాలన్నారు. జీహెచ్ఎంసీ ద్వారా విధులు నిర్వహిస్తున్న బూత్ లెవల్ అధికారులు శివకుమార్, మహేష్ ఓటు వినియోగానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించిన నిర్వాహకులను అభినందించారు. కొలను బాల్‌రెడ్డి, షాబాద్ సత్యనారాయణ, రమేష్, మానిక్‌రావు పటేల్ పాల్గొన్నారు.

బిహార్‌లో 65 శాతం రిజర్వేషన్ల పెంపు హర్షనీయం

ఉస్మానియా యూనివర్సిటీ: బిహార్‌లో 65 శాతం రిజర్వేషన్ల పెంపు పై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. బిహార్ తరహా అని రాష్ట్రాలలో కులగణన చేపట్టి జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మధు, భాస్కర్, విజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సనత్‌నగర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మాజీ కార్పొరేటర్ శీలం ప్రభాకర్‌ను మాజీ మంత్రి, మర్రి శశిధర్‌రెడ్డి పరామర్శించారు. కిమ్స్–సన్‌షైన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిని అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం చెప్పాలి



ప్రచారంలో పాల్గొన్న కృష్ణారావు

సనత్‌నగర్: 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ బేగంపేట ప్రజల కష్టాలను ఏనాడూ పట్టించుకోలేదని కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు. మంగళవారం ఆయన కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరితో కలిసి ప్రకాష్‌నగర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, మయూరిమార్గ్, మాతాజీనగర్, శ్యాంలాల్‌బిల్డింగ్ ప్రాంతాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించిన ఘటన బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రచారానికి వెళ్లిన ఆయనకు అడుగడుగునా మంగళహారతులు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత శ్యాంలాల్ బిల్డింగ్ శ్మశానవాటిక స్థలం కోసం ఎంతగానో పోరాడి సాధించామన్నారు. దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు బేగంపేట ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం అసత్య ప్రచారం చేసి పబ్బం గడుపుకొనే ఆ పార్టీలకు డిపాజిట్లు రాకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, రాజయ్య, అమరం శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

- బేగంపేటకు చెందిన ఓ కళాకారుడు తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. విస్తరాకులపై ముఖ్యమంత్రి కేసీఆర్, మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ పార్టీ గుర్తు కారు చిత్రాలను గీసి అబ్బురపరిచాడు.

అభివృద్ధి, సంక్షేమానికే పట్టం కట్టాలి

లాలాపేట: ప్రభుత్వం నుంచి నిధులు పుష్కలంగా సాధించి ఎన్నో కీలకమైన ప్రాజెక్టులను చేపట్టి సికింద్రాబాద్ నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నామని బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం తార్నాక డివిజన్‌లో పలు ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. తార్నాక చింతల్ బస్తీలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం పాటు పడుతున్న బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి, మోతే శోభన్ రెడ్డి, చింతల్ లక్ష్మణ్, వేణుగోపాల్‌రెడ్డి, బందెల స్వామి పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023

సాయన్న కూతురును ఆశీర్వదించండి



ప్రచారంలో పాల్గొన్న గీత, లాస్య నందిత

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే సాయన్న నిత్యం ప్రజా సంక్షేమం కోసమే పరితపించేవారని ఆయన సతీమణి గీత సాయన్న అన్నారు. నాలుగో వార్డు పరిధిలోని శ్రీరంగా గార్డెన్స్, శ్రీనివాసులు గార్డెన్స్, బూసారెడ్డి గూడ, భాస్కర్ రావు గార్డెన్స్ ప్రాంతాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితకు తోడుగా ఆమె తల్లి గీత ప్రచారంలో పాల్గొని సాయన్న వారసురాలిగా పోటీ చేస్తున్న లాస్య నందితను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో గజ్జెల నాగేష్, నళిని కిరణ్, వినోద్ కుమార్, శ్రీకాంత్, గంగారామ్ పాల్గొన్నారు.

బేగంపేట విమానాశ్రయంలో ప్రధానికి ఘన స్వాగతం

సనత్‌నగర్: ఎల్బీస్టేడియంలో నిర్వహించిన బీసీ ఆత్మగౌరవ సభకు హాజరయ్యేందుకు నగరానికి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మంగళవారం సాయంత్రం బేగంపేట విమానాశ్రయంలో బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ప్రయాగ్‌రాజ్ నుంచి సాయంత్రం 5.15 గంటలకు ప్రత్యేక విమానంలో ప్రధానమంత్రి బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడి భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రత్యేక కాన్వాయ్‌లో ఎల్బీ స్టేడియానికి తరలివెళ్లారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, సీనియర్ నాయకులు నరేష్‌కుమార్, సుభాష్‌చందర్, వెంకట నారాయణ రెడ్డి, రామ్‌చందర్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దాసరి మల్లేశం ప్రధాని మోదీకి స్వాగతం పలికారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

అడ్డగుట్ట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని శాస్త్రీనగర్ మహిళా సంఘం అధ్యక్షురాలు అలివేలు అన్నారు. అడ్డగుట్ట డివిజన్‌లో నూతనంగా శాస్త్రినగర్ మహిళా సంఘం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అలివేలు మాట్లాడుతూ.. హక్కుల సాధన కోసం మహిళలందరూ సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇక నుంచి స్థానిక సమస్యల పరిష్కారానికై తమ సంఘం ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులను నిలదీస్తామన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న పార్టీలకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అనంతరం శాస్త్రినగర్ మహిళా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గౌరమ్మ, కోశాధికారి యాదమ్మ, ఉపాధ్యక్షురాలు భూలక్ష్మి, సభ్యులు లావణ్య, జ్యోతి, అక్షయ, రమణమ్మ, నిహారికలతో పాటు 100 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఇఫ్లూ విద్యార్థుల హంగర్ స్ట్రైక్



ఉస్మానియా యూనివర్సిటీ: ఇఫ్లూ విద్యార్థులు హంగర్ స్ట్రైక్ చేపట్టారు. ఈ నెల 6వ తేదీ రాత్రి నుంచి యూనివర్సిటీ ప్రవేశ ద్వారం వద్ద దీక్షలు చేపట్టారు. గత నెల 18న లైంగిక వేధింపులకు గురైన పీజీ విద్యార్థినికి న్యాయం జరిగే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని విద్యార్థులు హెచ్చరిస్తున్నారు.

ఉద్యోగాల పేర్లతో మోసం

వ్యక్తి రిమాండ్

రాంగోపాల్‌పేట్: హైకోర్టు, పోస్టల్ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి రూ.13.5 లక్షలు మోసం చేసిన వ్యక్తిని మార్కెట్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. శివాజీనగర్‌లోని డొక్కలమ్మ దేవాలయం ప్రాంతంలో అనిత అనే మహిళ తన ముగ్గురు కుమారులతో కలిసి ఉంటుంది. సూర్యాపేటకు చెందిన ఓ వ్యక్తి ద్వారా అల్కాపురిలో నివాసముండే నాగరాజు అనే వ్యక్తి ఐదేళ్ల క్రితం పరిచయమయ్యాడు. నాగరాజు ఎల్‌బీనగర్‌లో ధనలక్ష్మి మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ పేరుతో సంస్థను నడిపిస్తూ నిరుద్యోగులను మోసం చేస్తున్నాడు. అనిత ముగ్గురు కుమారులకు పోస్టల్ లేదా హైకోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానని నాగరాజు నమ్మించాడు. ఆయన మాటలు నమ్మిన ఆమె విడతల వారీగా రూ.13.50 లక్షలు ఇచ్చింది. అప్పటి నుంచి రేపు, ఎల్లుండి అంటూ కాలం వెళ్లబుచ్చుతూ వస్తున్న ఆయన ఉద్యోగాలు ఇప్పించకపోగా ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వడం లేదు. దీంతో ఆమె మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టి నిందితుడు నాగరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సౌకర్యార్థమని నిర్మించారు.. నిరుపయోగంగా మార్చారు!



ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థి సంఘాల కోసం నిర్మించిన విద్యార్థి చర్చ వేదిక భవనం (స్టూడెంట్ డిస్కోర్స్ సెంటర్) నిరుపయోగంగా మారుతోంది. ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థి సంఘాల సభలు, సమావేశాలు, ఆందోళనలు, ఇతర కార్యక్రమాలపై నిషేధం విధించిన వీసీ ప్రొ.రవీందర్ రెండేళ్ల క్రితం రూ.18 లక్షల వ్యయంతో ప్రత్యేక భవనాన్ని నిర్మించారు. కానీ ఈ భవనంతో పట్టుమని పది కార్యక్రమాలు కూడా జరగలేదు. చేసే కార్యక్రమాలు ఆర్ట్స్ కాలేజీ ఎదుట అయితే మీడియా ద్వారా గుర్తింపు వస్తుందని విద్యార్థులు జన్మదిన వేడుకలతో మొదలు ప్రతి కార్యక్రమాన్ని కళాశాల వేదికగా నిర్వహిస్తున్నారు. దీంతో డిస్కోర్స్ సెంటర్ భవనం వృథాగా దర్శనమిస్తోంది. ఈ భవనాన్ని ఇతర కార్యక్రమాలకు ఉపయోగించాలని విద్యార్థి నేతలు పేర్కొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం



బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ పరిధిలోని ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. 50 ఏళ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదిన్నర ఏళ్లలో తెలంగాణ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. క్రిస్టియన్, ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అనేక కార్యక్రమాలు తమ ప్రభుత్వం చేసిందని వివరించారు. శ్మశానవాటికలు, మసీదులు, చర్చిల అభివృద్ధి, మరమ్మతుల కోసం అధిక నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ ప్రతినిధులు ప్రశాంత్, జయరాజ్, సామెల్, దయాకర్, శ్యాంసన్, సుధీర్‌కుమార్, ముస్లిం ప్రతినిధులు ఖలీల్, పహీం, నోమాన్ అబ్బాస్, రజాక్, కరీం, అఖిల్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

- సనత్‌నగర్ డివిజన్ డీఎస్ఎంకాలనీకి చెందిన ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలకులు పట్టించుకోని దీర్ఘకాలిక సమస్యలను సైతం తాను పరిష్కరించానన్నారు. మరోసారి అవకాశం కల్పించాలన్నారు.
- సబ్బండ వర్గాల సంతోషమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పటికే పంపిణీ చేయడం జరిగిందని, మరో 30,000 నిర్మాణంలో ఉన్నాయని మరో లక్ష ఇళ్లు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మందకృష్ణ



ఉస్మానియా యూనివర్సిటీ: మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ అన్నారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ 57వ తరగతి గదిలో ఈ నెల 11న జరిగే మహాసభ విజయవంతం కోసం సన్నాహక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ.. ఏ పార్టీ గెలిచినా ఓడినా మాదిగలకు ఒరిగేది ఏమీ లేదని రిజర్వేషన్ల వర్గీకరణతోనే అభివృద్ధి అవుతామన్నారు. విశ్వరూప మహాసభకు మాదిగలు, మాదిగ ఉపకులాలు లక్షలాదిగా తరలిరావాలని కోరారు.

పద్మారావునగర్: సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో ఈ నెల 11న జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నాయకులు కుమార్ మాదిగ, వాసు, రాజు, సుభాష్ తదితరులు కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగలు అన్ని విధాలా అభివృద్ధి చెందడంతో పాటు మనుగడ ఆశాజనకంగా ఉంటుందన్నారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ సుమారు 28 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు.

నామినేషన్ల దాఖలు



కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెల తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న సుచరిత

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో మంగళవారం మూడు నామినేషన్‌లు దాఖలయ్యాయి . తొలి రోజు శ్రమజీవి పార్టీ తరఫున జాజుల భాస్కర్ నామినేషన్ చేయగా, ఇప్పటి వరకు నాలుగు నామినేషన్ అయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా జీవీ వెన్నెల రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, మరో అభ్యర్థిని నాతి రాగ మంజుల సైతం కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన గజ్వేల్ భరత్ ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేశారు. కంటోన్మెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన వెన్నెల తరఫున సుచరిత నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్‌కు సమర్పించారు.

సికిందాబాద్‌లో..

సికింద్రాబాద్: సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. నిజామాబాద్‌కు చెందిన మద్దెర్ల ఆల్ఫ్రెడ్ అరుణ్‌కుమార్ ఇండియా ప్రజాబంధు పార్టీ నుంచి, లాలాపేటకు చెందిన పీఎస్ అరుణ్‌కుమార్ ఇండియన్ డెలివర్ పార్టీ నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. పార్శిగుట్టకు చెందిన ముడుగుల సునీత స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల మొదటి రోజు దాఖలైన ఒకటితో కలిపి సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు దాఖలైన నామినేషన్ల సంఖ్య 4కు చేరినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.ఎల్లారెడ్డి పేర్కొన్నారు.

సనత్‌నగర్ నుంచి..

సనత్‌నగర్: సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి మంగళవారం మరో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ధర్మ సమాజ్ పార్టీ తరుపున కార్తీక్ మేడి, స్వతంత్ర అభ్యర్థిగా చెక్కల కాంచనమాల నామినేషన్లు వేశారు.

కాంగ్రెస్‌లో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెన్నెల

రసూల్‌పురా: కంటోన్మెంట్ ఓటర్లు బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని ఆ పార్టీ అభ్యర్థి జి. వెన్నెల అన్నారు. రసూల్‌పురా అవంతి కాలనీలో పార్టీ సీనియర్ నాయకులు పద్మా శాంసన్ రాజు ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. ప్రచారంలో ఫస్సీ, మురళి, స్వరూప, శ్రీహరి సత్యనారాయణ, సంజీవ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడి రాజీనామా

ఉస్మానియా యూనివర్సిటీ: వైఎస్ఆర్‌టీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు తన పదవీకి రాజీనామా చేశారు. మంగళవారం వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలకు లేఖరాసి రాజీనామా చేశారు.

నియామకం



బాల్‌రాజ్ యాదవ్

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్ పేట్ డివిజన్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జిగా సాదం బాల్‌రాజ్ యాదవ్ నియమిస్తూ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన బాల్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం తలసాని శ్రీనివాస్ యాదవ్ గెలుపునకు కృషి చేస్తామన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్: పెళ్లి కావడం లేదని ఓ వ్యక్తి మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లక్ష్మయ్య వివరాల ప్రకారం.. బూర్గుశెట్టి బజార్‌కు చెందిన విశ్వనాథం (41), తండ్రి మరణించినప్పటి నుంచి వస్త్రాల దుకాణం నిర్వహిస్తున్నారు. గత కొన్ని రోజుల నుంచి వివాహం కోసం చూస్తుండగా ఎక్కడా సంబంధం కుదరడం లేదు. దీనికి తోడు వ్యాపారం కూడా సరిగా నడవక పోవడంతో నష్టాలు వస్తున్నాయి. పెళ్లి విషయంతో తరచూ చిన్నాన్న కుటుంబ సభ్యులతో చర్చిస్తూ బాధపడుతుండగా వాళ్లు ధైర్యం చెప్పేవాళ్లు. సోమవారం సాయంత్రం రెండో అంతస్తులోకి వెళ్లి ఎంతకీ బయటకు రాకపోవడంతో వరసకు సోదరుడైన అభిషేక్ పైకి వెళ్లి తలుపులు కొట్టాడు. తీయకపోవడంతో బాల్కానీలోకి వెళ్లి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. తలుపులు విరగొట్టి గాంధీ ఆస్పత్రికి తీసుకుని వెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారు.

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి

అడ్డగుట్ట: ఆర్యవైశ్య సంఘం తుకారాంగేట్ నూతన అధ్యక్షుడిగా అడ్డగుట్టకు చెందిన శ్రీకాంత్ గుప్తాను ఎన్నుకున్నారు. అదే విధంగా ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, శ్రీనివాస్, శ్రీధర్, కోశాధికారి నాగబండి శ్రీను, నర్సింగ్‌రావు, కార్యదర్శులుగా కొడరావు శ్రీనివాస్, అశోక్, శివకుమార్‌ను ఎన్నుకున్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ప్రజలకు న్యాయం చేసే మేనిఫెస్టోతో ముందుకు రావాలి



నిరసన తెలుపుతున్న దళిత సంఘర్షణ సమితి ప్రతినిధులు

సికింద్రాబాద్: అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూర్చే విధంగా ఉండే ఎజెండాతో మాత్రమే రాజకీయ పార్టీలు ప్రజల ముందుకు రావాలని దళిత సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో సీతాఫల్ మండి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుత మేనిఫెస్టోలు రాజకీయ ప్రయోజనాల తప్ప ప్రజలకు న్యాయం చేకూర్చే విధంగా లేవన్నారు. కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి నాయకులు నీరుడుకష్ణ, వెంకటేశ్వర్లు, రమేష్, సురేందర్, నాగేష్, పద్మ, వేణు, వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీసీలకు బీఆర్ఎస్ చేసిందేమీ లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న షామా మహమద్

కంటోన్మెంట్: బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ సంక్షేమం కోసం చేసిందేమీ లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి షామా మహమద్ అన్నారు. మంగళవారం మడ్‌ఫోర్ట్‌లోని బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎన్నికల కార్యాలయంలో అభ్యర్థి జీవీ వెన్నెల, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి మర్రి అమరేందర్ రెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్ర సాధారణ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో పేదలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఇటీవల జరిగిన కర్నాటక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే తాము ఎన్నికల ప్రచారంలో పేర్కొన్న ఐదు గ్యారంటీల అమలు చేస్తున్నామన్నారు. బీసీ బంధు పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. బీసీలపై ప్రేమ ఉంటే కేబినెట్‌లో కేవలం ముగ్గురికి మంత్రి పదవులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అన్నారు.

డబుల్ బెడ్రూమ్ అవినీతి బహిర్గతం చేస్తాం..

కంటోన్మెంట్‌లో డబుల్ బెడ్రూమ్, దళిత బంధు పథకాల అమలులో జరిగిన అవినీతిని త్వరలోనే ఆధారాలతో సహా బయటపెడతామని మర్రి అమరేందర్ అన్నారు. కంటోన్మెంట్‌లో భూబదలాయింపు చేయకపోవడం వల్ల వేలాది మంది నిరుపేదలకు పట్టాలు దక్కలేదన్నారు. తమ అభ్యర్థి వెన్నెలను గెలిపిస్తే ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు భూబదలాయింపు ద్వారా పట్టాలు ఇప్పిస్తామన్నారు. రూ.800 కోట్ల సర్వీసు చార్జీలు విడుదల చేయకుండా కేంద్రం కంటోన్మెంట్‌కు అన్యాయం చేస్తోందన్నారు. జీహెచ్ఎంసీలో విలీనం పేరిట దాదాపు మూడేళ్లుగా కంటోన్మెంట్‌లో ప్రజాప్రతినిధులే లేకుండా చేశారని అన్నారు.

టెక్నాలజీ కాలేజీ హాస్టల్ సమస్యలు పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని టెక్నాలజీ కాలేజీ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నేత రవినాయక్ మంగళవారం అధికారులను కోరారు. హాస్టల్‌లో గదుల్లో పరిమితికి మించి విద్యార్థులు, నాణ్యతలేని ఆహారం, అధిక మెస్ బిల్లులు, తదితర సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని రవినాయక్ పేర్కొన్నారు.